ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా చెల్లించవలసిన బకాయి మొత్తం **తేది. 04.06.2024 నాటికి రూ. 32,99,75,214/- (అక్షరాల ముప్పై రెండు కోట్ల తొంభై తొమ్మిది లక్షల డెబ్భై ఐదు వేల రెండు వందల పద్నాలుగు రూపాయలు మాత్రమే)** + వర్తించు వడ్డీ, యాదృచ్ఛిక ఖర్చులు, ఛార్జీలు మరియు కాస్ట్స్‌తో సహా **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీత తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

తనఖా పెట్టిన షెడ్యూల్ ఆస్తి వివరములు

(శ్రీ పేపేటి వడ్డికాసులు, తండ్రి. పెద్దిరాజు గారికి చెందిన రిజిష్టర్డ్ అమ్మకం దస్తావేజు నెం.2054/2011 మరియు తేది.29.06.2011, బీబీనగర్ ఎస్.ఆర్.ఓ ప్రకారం)

నల్గొండ జిల్లా, పోచంపల్లి గ్రామం మరియు మండలం, ఐడియా సిటీ వద్ద గల సర్వే నెం.707, 708, 710, 711, 712, 736 & 737 మరియు ప్లాట్ నెంలు.240, 241, 242, 243, 244, 245, 246, 247, 248, 249, 250, 251, 252, 253, 254, 255, 256, 257, 258, 259, 260, 261, 262, 263, 264, 265, 389, 390, 391, 392, 393, 394, 395 మరియు 396, అమ్మకం దస్తావేజు నెం.2054/2011 ప్రకారం విస్తీర్ణం 7017 చ॥గ॥లులోని ఖాళీ స్థలం. **ప్లాట్ నెం.240 నుండి 265 యొక్క హద్దులు : ఉత్తరం :** ప్లాట్ నెం.239 & 266, **దక్షిణం :** 40 అ॥ల వెడల్పు రోడ్డు, **తూర్పు :** 33 అ॥ల వెడల్పు రోడ్డు, **పడమర :** 33 అ॥ల వెడల్పు రోడ్డు. **ప్లాట్ నెం.389 నుండి 392 యొక్క హద్దులు : ఉత్తరం :** 40 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం :** ప్లాట్ నెం.393, **తూర్పు :** ఇతరుల భూమి, **పడమర :** 33 అ॥ల వెడల్పు రోడ్డు. **ప్లాట్ నెం.393 నుండి 396 యొక్క హద్దులు : ఉత్తరం :** ప్లాట్ నెం.392 & ఇతరుల భూమి, **దక్షిణం :** 40 అ॥ల వెడల్పు రోడ్డు, **తూర్పు :** ఇతరుల భూమి, **పడమర :** 33 అ॥ల వెడల్పు రోడ్డు.

తేది : 28.08.2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : రాజమండ్రి ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్

IDBI BANK **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్**
దానవాయిపేట బ్రాంచ్, రాజమండ్రి

అనుబంధం-V (రూల్ 8(1)) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002లో చట్టం 54) ప్రకారం **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్,** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12) కు అనుసంధానమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు : శ్రీ ప్రసాద్ చలసాని, శ్రీ వెంకట అప్పారావు అడబాల, శ్రీ త్రిమూర్తులు అన్యం, శ్రీ వెంకట నాగేశ్వర రావు చినిమిల్లి, శ్రీ పొలిశెట్టి ఉమా మహేశ్వర రావు మరియు శ్రీ కనుమూరి కాశి రాజు మరియు శ్రీ పొలిశెట్టి ఉమా మహేశ్వర రావు (తనఖాదారులు)** వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **తేది. 04.06.2024 నాటికి రూ. 24,44,73,662/- (అక్షరాల ఇరవై నాలుగు కోట్ల నలభై నాలుగు లక్షల డెబ్భై మూడు వేల ఆరు వందల అరవై రెండు రూపాయలు మాత్రమే)** ప్లస్ వర్తించు వడ్డీ, యాదృచ్ఛిక ఖర్చులు, ఛార్జీలు మరియు కాస్ట్స్‌తో కలిపి నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలిసినదిగా **తేది. 07.06.2024** న డిమాండు నోటీసు జారీ చేయబడినది మరియు డిమాండ్ నోటీసులు బట్వాడా చేయకుండా తిరిగి వచ్చినందున **తేది. 27.06.2024 న సాక్షి (తెలుగు) మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్)** దినపత్రికలలో ప్రచురించినాము.

ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 8 ప్రకారము **తేది. 28.08.2024** న దిగువ పేర్కొన్న ఆస్తిని **స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా చెల్లించవలసిన బకాయి మొత్తం **తేది. 04.06.2024 నాటికి రూ. 24,44,73,662/- (అక్షరాల ఇరవై నాలుగు కోట్ల నలభై నాలుగు లక్షల డెబ్భై మూడు వేల ఆరు వందల అరవై రెండు రూపాయలు మాత్రమే)** + వర్తించు వడ్డీ, యాదృచ్ఛిక ఖర్చులు, ఛార్జీలు మరియు కాస్ట్స్‌తో సహా **ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీత తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

తనఖా పెట్టిన షెడ్యూల్ ఆస్తి వివరములు

(శ్రీ కనుమూరి కాశి రాజు గారికి చెందిన రిజిష్టర్డ్ అమ్మకం దస్తావేజు నెం.10761/2010 మరియు తేది.24.11.2010, సంగారెడ్డి ఎస్.ఆర్.ఓ ప్రకారం)

మెదక్ జిల్లా, పటాన్‌చెరువు మండలం, ఐనవోలు గ్రామం యొక్క వేదాత్రేయ నిలయం వద్ద గల క్రింద చెప్పబడిన వివిధ విస్తీర్ణములలోని ఖాళీ స్థలం

1) అమ్మకం దస్తావేజు నెం.10761/2010, సర్వే నెం.119ఇ, 119ఆర్, 119యు, 119ఎ & 120ఎ, విస్తీర్ణం (చ॥గ॥లు) 3483.92. 2) అమ్మకం దస్తావేజు నెం.10712/2010, సర్వే నెం.125/2ఎ, 126/ఎ, 119/ఇ, 119/ఆర్, 119/యు, 119/ఇ & 119/ఎ, విస్తీర్ణం (చ॥గ॥లు) 3779.35. ప్లాట్ నెం.116, 117 & 118 యొక్క హద్దులు : ఉత్తరం : ప్లాట్ నెం.119, **దక్షిణం :** 40 అ॥ల వెడల్పు రోడ్డు, **తూర్పు :** 33 అ॥ల వెడల్పు రోడ్డు, **పడమర :** ప్లాట్ నెం.159, 158 & 157. **ప్లాట్ నెం.136/ఎ,బి,సి,బి, 137/ఎ,బి, 138 & 139 యొక్క హద్దులు : ఉత్తరం :** 33 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం :** ప్లాట్ నెం.140 & 135, **తూర్పు :** 33 అ॥ల వెడల్పు రోడ్డు, **పడమర :** 33 అ॥ల వెడల్పు రోడ్డు. **ప్లాట్ నెం.2,3,4,5,6,7,8,9,10,11 యొక్క హద్దులు : ఉత్తరం :** ప్లాట్ నెం.1, **దక్షిణం :** 50 అ॥ల వెడల్పు రోడ్డు, **తూర్పు :** ఇతరుల భూమి, **పడమర :** 33 అ॥ల వెడల్పు రోడ్డు. **ప్లాట్ నెం.145 & 130 యొక్క హద్దులు : ఉత్తరం :** ప్లాట్ నెం.144 & 131, **దక్షిణం :** ప్లాట్ నెం.146 & 129, **తూర్పు :** 33 అ॥ల వెడల్పు రోడ్డు. **పడమర :** 33 అ॥ల వెడల్పు రోడ్డు.

తేది : 28.08.2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : రాజమండ్రి ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్

రాంనగర్‌లో హైడ్రా కమిషనర్ ఆకస్మిక పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముషీరాబాద్ నియోజకవర్గంలో బుధవారం సాయంత్రం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆకస్మికంగా పర్యటించారు. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ గల్లీలో నాలాపై అక్రమ నిర్మాణాలు చేపట్టారని స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ పరిశీలించారు. మణెమ్మ గల్లీలో రోడ్డు ఇరుకుగా మారిందని, నాలా.. రోడ్డును ఆక్రమించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వర్షం వచ్చిన ప్రతిసారి ఇళ్లలోకి వరదనీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు మొరపెట్టుకున్నారు. నాలా ఆక్రమణ, రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి వివరాలు, సబంధిత స్థల పత్రాలను పరిశీలించాలని జిహెచ్ఎంసి, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు.

మళ్లీ చెప్తున్నాం... అధికారంలోకి వచ్చాక తొలగిస్తాం : కెటిఆర్ ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారంలోకి వచ్చాక తెలంగాణకు అక్కరకురాని వాళ్ళ బొమ్మలను తొలగిస్తామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం 'మళ్లీ చెప్తున్నాం...రాసి పెట్టుకో' అంటూ సిఎం రేవంత్‌నుద్దేశించి ఘాటుగా వ్యాఖ్యానిస్తూ ట్వీట్ చేశారు. తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్టిస్తామని తెలిపారు. 'సోనియాగాంధీని దెయ్యం, పిశాచి, బలిదేవత అన్న నువ్వా రాజీవ్ గాంధీ మీద ప్రేమ ఒలకబోసేది. దొడ్డి దారిన పిసిసి ప్రెసిడెంట్ అయ్యి ఇవాళ రాజీవ్‌గాంధీ మీద కపట ప్రేమను ఒలకబోస్తున్నావు.. నీ అసలు రంగు అందరికీ తెలుసు.....' అని విమర్శించారు. సిఎం ఆలోచనల్లో కుసంస్కారం దాగుందనీ, ఆయన మాటలు అష్ట వికారంగా ఉన్నాయని తప్పుపట్టారు. తెలంగాణతల్లి కోసం నిర్ణయించిన స్థలంలో కాంగ్రెస్ నాయకుల విగ్రహాలేమిటని అడిగితే కారుకూతలు కూస్తావా? అంటూ ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమం గుండెల్లో గునపాలు దించిన నీ చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినా అది అవమానమే, అది గాంధీ విగ్రహం గాడ్సే పెడితే ఎట్లుంటదో అట్లుంటదని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

సిఎన్‌సి ఎక్స్‌పో ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేబుల్ టివి, ఇంటర్నెట్ ఆపరేటర్లకు సాంకేతిక పరిజ్ఞానానికి సిఎన్‌సి 12వ ఎక్స్‌పో ఎంతో దోహదం చేస్తున్నదని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చెప్పారు. కేబుల్ టివి, ఇంటర్నెట్, ఒటిటి, ఐఓటిలకు ఒకే వేదికగా ఈ సంస్థ నిలుస్తున్నదని చెప్పారు. బుధవారం హైదరాబాద్, మాదాపూర్‌లోని హైటెక్స్‌లో12వ సిఎన్‌సి ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాటి సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ సంస్థను ప్రారంభించారని గుర్తు చేశారు. ఇప్పుడు తాను ఎక్స్‌పోను ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. ఇందులో 300లకుపైగా బ్రాండ్స్‌తో 200కుపైగా స్టాల్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతియేటా 30 వేల మంది సందర్శకులు వస్తూ మంచి ఆదరణ కలిగి ఉన్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం ఆధునిక సాంకేతికతతోపాటు అప్ టు డేట్ సమాచారాన్ని అందిస్తున్నదని తెలిపారు. కరోనా లాంటి సమయంలో ఈ సంస్థ ప్రజలకు వినోదం పంచిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 45000 మంది ఉపాధి అవకాశాలను పొందుతున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఆరు లక్షల మందికి పైగా కేబుల్ ఆపరేటర్లు ఉన్నారని చెప్పారు.

ఉచితంగా లలిత విష్ణు సహస్ర దివ్య గ్రంథం

ప్రజాశక్తి - కల్చరల్

గణపతి మహా నవరాత్రులను పురస్కరించుకుని ప్రముఖ రచయిత, శ్రీశైల దేవస్థానం పూర్వ సలహాదారులు పురాణపండ శ్రీనివాస్ అద్భుత రచనా సంకలనం ' శ్రీ లలిత విష్ణు సహస్రనామ స్తోత్ర వైభవ ' గ్రంధాన్ని జంట నగరాల్లోని సాంస్కృతిక, సాహిత్య, కళా సంస్థలకు, అర్చకులకు, వేదపండితులకు , వేద పాఠశాలలకు ఉచితంగా అందజేస్తున్నట్లు శృంగేరీ జ్ఞాన సరస్వతీ ఆలయం ధర్మాధికారి కళా జనార్ధనమూర్తి తెలిపారు. సుమారు మూడు వందల పేజీలతో వందకు పైగా స్తోత్ర విద్యలతో రూపుదిద్దుకున్న శ్రీ లలిత విష్ణు సహస్రనామ స్తోత్ర గ్రంధాన్ని సెప్టెంబర్ 3 , 4 తేదీల్లో ఉదయం తొమ్మిది గంటలనుండి సాయంకాలం ఐదు గంటల వరకు ముషీరాబాద్ గాంధీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న జ్ఞాన సరస్వతీ ఆలయంలో పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి సహకరించిన ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్‌కు జనార్ధన మూర్తి ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్తు అమరుల స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

ప్రజలపై భారం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి • విద్యుత్తు ఉద్యమ అమరులకు వామపక్ష నేతల నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్తు అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని వామపక్ష నేతలు కోరారు. ప్రజలపై భారాలు వేయవద్దనీ, రైతులు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్తు అమరవీరుల 24వ వర్ధంతి సందర్భంగా వామపక్ష పార్టీల నేతలు బుధవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న షహీద్ చౌక్ అమరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 'జోహార్ రామకృష్ణ, జోహార్ విష్ణువర్ధన్ రెడ్డి, జోహార్ బాలస్వామి.. అమరవీరులకు జోహార్ జోహార్, ప్రపంచబ్యాంకు విధానాలు నశించాలి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా 2000, ఆగస్టు 28న జరిగిన ఉద్యమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి అసువులు బాసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నాడు టిడిపి ప్రభుత్వం విద్యుత్తు చార్జీలను పెంచి ప్రజలపై భారాలు మోపిందని చెప్పారు. దానికి వ్యతిరేకంగా పెద్దఉద్యమం సాగిందన్నారు. 2000 సంవత్సరంలో ఇదేరోజు బషీర్ బాగ్ మరుభూమిగా మారిందని అన్నారు. లాఠీచార్జీ చేశారనీ, భాష్పవాయువు గోళాలను ప్రయోగించారని గుర్తు చేశారు. ఉద్యమకారులు, మహిళలను గుర్రాలతో తొక్కించారని చెప్పారు. ఆ తర్వాత 2004లో జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు ఘోరంగా ఓడిపోయారని గుర్తుచేశారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాచరిక పోకడలు అనుసరించిందని విమర్శించారు. విద్యుత్తు ఉద్యమాన్ని గుణపాఠంగా తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజకంగా పాలన సాగించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వరంగంలోనే విద్యుత్తు ఉత్పత్తి చేయాలి : జూలకంటి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచబ్యాంకు విధానాలు వెనక్కి పోవాలనీ, కరెంటు ఛార్జీలను పెంచొద్దనీ, ప్రయివేటీకరణ విధానాలను ఆపాలని 2000 సంవత్సరంలో ప్రజా ఉద్యమం జరిగిందని చెప్పారు. ముగ్గురు ప్రాణత్యాగం చేశారని అన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాల వల్ల విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా వ్యాపారంగా మారిందన్నారు. ఇష్టమొచ్చినట్టు ఇతర రాష్ట్రాల నుంచి ఒప్పందం చేసుకుని విద్యుత్‌ను కొనుగోలు చేయడం వల్ల ప్రజలపై భారాలు పడే ప్రమాదముందని చెప్పారు. రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో విద్యుత్‌ను ప్రభుత్వరంగంలోనే ఉత్పత్తి చేసుకునేందుకు వనరులున్నాయని వివరించారు. ప్రయివేటు సంస్థల లాభాలు, పాలకుల కమీషన్ల కోసం నిర్ణయాలను తీసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజలకు చార్జీలను పెంచకుండా సక్రమంగా కరెంటును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్థూపం వద్ద చెత్తకుప్పలు వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థూపం చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేసి అమరవీరులను గౌరవించాలని రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీని కోరారు. సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ... ప్రజలంతా కలిసి పోరాడినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. విద్యుత్ అమరవీరుల ఆశయాల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఝాన్సీ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సంఘటిత ఉద్యమాలను నిర్మించాలని చెప్పారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదులకు పాలకులు మోకరిల్లొద్దని కోరారు. అందరికీ ఉచితంగా విద్యుత్తును అందించే వనరులు రాష్ట్రంలో ఉన్నాయని చెప్పారు. ఎంసిపిఐ(యు) రాష్ట్ర నాయకులు అనిల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యమం జరిగి వచ్చే ఏడాది నాటికి 25 ఏండ్లు అవుతుందనీ, అమరవీరుల సంస్మరణ సభను పెద్దఎత్తున నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం శ్రీనివాస్, జె బాబురావు (సిపిఎం), పల్లా వెంకటరెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఎన్ బాలమల్లేష్, ఈటి నరసింహ (సిపిఐ), రమ, అరుణ, ప్రదీప్ (మాస్ లైన్), గోవర్ధన్, సంధ్య (న్యూడెమోక్రసీ) ప్రజాసంఘాల కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నిరసన కారులను అడ్డుకుంటున్న పోలీసులు

చేవెళ్ల ఎమ్మెల్యే కారుపై కోడిగుడ్లతో దాడి

- సొంత పార్టీ నాయకులు నుండే నిరసన సెగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సొంత పార్టీ నాయకుల నుంచే నిరసన సెగ తగిలింది. బుధవారం ఆయన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేసేందుకు రంగారెడ్డి జిల్లా షాబాద్ ఎంపిడిఓ కార్యాలయానికి వచ్చారు. అక్కడున్న కాంగ్రెస్ నాయకులు ఆయనపై ఒక్కసారిగా తిరగబడ్డారు. ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీమ్ భరత్ గ్రూపును తన వెంట కలుపుకొని పోవట్లేదంటూ నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి నుంచి పార్టీలో ఉండి కష్టపడ్డామని, నేడు ఎమ్మెల్యే అవ్వగానే పార్టీ మారి, పార్టీలో ఉన్న పాత నాయకులను ఎలా మర్చిపోతారంటూ ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇరు గ్రూపుల వారు బాహాబాహీకి దిగేందుకు ప్రయత్నించగా.. సమయానికి అక్కడే ఉన్న పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. భీమ్ భారత్ వర్గీయులు ఎమ్మెల్యే కాలె యాదయ్య వాహనంపై కోడిగుడ్లతో దాడి చేశారు. గో బ్యాక్ ఎమ్మెల్యే, గోబ్యాక్ ఎమ్మెల్యే అంటూ నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే కారు ముందు బైటాయించారు. తమతో మాట్లాడే వరకు, ఆయన్ను రానిచ్చేది లేదంటూ వాహనానికి అడ్డుతగిలారు. సుమారు గంటకు పైగా కార్యకర్తలు నిరసన తెలుపుతున్నా.. ఎమ్మెల్యే మాత్రం కారు దిగి రాలేదు. పోలీసులు రంగంలోకి దిగి ఆందోళన చేస్తున్న పార్టీ నాయకులను సముదాయించి అక్కడినుంచి పంపించారు. అనంతరం ఆయన లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

టెక్నో పెయింట్స్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ ఏర్పాటు

- అన్ని మెట్రో నగరాల్లోనూ స్థాపిస్తాం
- కంపెనీ సిఎండి ఆకూరి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్

పెయింట్స్ రంగంలో రాణిస్తోన్న టెక్నో పెయింట్స్ హైదరాబాద్‌లో తొలి ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. హైటెక్‌సిటీ హెచ్ఐసిసికి సమీపంలో 2,100 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. రామ్‌కి గ్రూప్ ఛైర్మన్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఐజిబిసి నేషనల్ వైస్ ఛైర్మన్ సి.శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ నేషనల్ సెక్రటరీ జి.రాంరెడ్డి, క్రెడాయ్ తెలంగాణ మాజీ ఛైర్మన్ సిహెచ్ రామచంద్రారెడ్డి తదితరుల సమక్షంలో ఈ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. అనుబంధ కంపెనీ రిచ్‌వేవ్స్ తయారు చేస్తున్న ఇటాలియన్, లగ్జరీ ఫినిషెస్‌ను ఇక్కడ ప్రదర్శిస్తారు. రిచ్‌వేవ్స్ బ్రాండ్‌లో 200లకుపైగా వెరైటీలను ఆఫర్ చేస్తున్నట్టు టెక్నో పెయింట్స్ సిఎండి ఆకూరి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు తెలిపారు. సంస్థ ఆర్అండ్‌డి, తయారీ సామర్థ్యానికి రిచ్‌వేవ్స్ నిదర్శనం అని అన్నారు. వీటి తయారీకై హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ప్రత్యేకంగా ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. అన్ని మెట్రో నగరాల్లోనూ ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించుకున్నామన్నారు.

ఆమె కడిగిన ముత్యం కాదు... రుజువైతే మళ్లీ జైలుకే

- కాంగ్రెస్ నేత గజ్జెల కాంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అద్దె ఇంట్లో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వేల కోట్ల రూపాయల ఆస్తులెలా వచ్చాయని కాంగ్రెస్ నేత గజ్జల కాంతం ప్రశ్నించారు. ఆమె కడిగిన ముత్యం కాదనీ, నేరం రుజువైతే మళ్లీ జైల్లో కటకటాలు లెక్కించక తప్పదని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని లూటీ చేసి లిక్కర్ కుంభకోణంలో జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. లిక్కర్ స్కామ్‌లో రూ.100 కోట్లు బయటపడిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కొత్త ఇంటి కోసం ఇతర దేశాల నుంచి రూ.50 కోట్ల ఫర్నీచర్ కొనుగోలు చేసిందని ఆరోపించారు. దుబాయ్‌లో రూ.500 కోట్లతో ప్లాటు కొన్నది వాస్తవం కాదా? అక్కడ పదివేల కోట్ల పెట్టుబడులు పెట్టింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కవితకు పట్టిన గతే మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావుకు పడుతుందని హెచ్చరించారు. మాజీ మంత్రి కెటిఆర్ రూ.500 కోట్లతో అండర్ గ్రౌండ్ ఇల్లు నిర్మించారనీ, అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. హైడ్రా దూకుడు పట్ల అణగారిన ప్రజల్లో హర్షాతిరేకలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణదారుల్లో హైడ్రా భయం

- భూకబ్జాలపై శ్వేతపత్రం ప్రకటించాలి
- కవిత బెయిల్‌పై రాజకీయాలొద్దు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైడ్రా కూల్చివేతల పట్ల ఆక్రమణదారుల్లో భయం పుట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు కొన్న స్థలాల్లోని నిర్మాణాలను కూల్చే ముందు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. వారికి పునరావాసం కల్పించకుండా ఆ నిర్మాణాలను కూల్చొద్దని చెప్పారు. హైడ్రా కూల్చివేతల విషయంలో గందరగోళం, పేద, మధ్యతరగతి ప్రజల్లో అయోమయం నెలకొందన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములు, వక్ఫ్ భూములు, దేవాదాయ భూములు తదితర భూముల్లో కబ్జాలు, ఆక్రమణలకు సంబంధించి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఎన్ బాలమల్లేష్‌తో కలిసి కూనంనేని మాట్లాడారు. హైడ్రా చేపడుతున్న కార్యకలాపాల విషయంలో ప్రభుత్వం వెనకడుగు వేయొద్దనీ, బడాబాబులను చూసి భయపడకుండా అడుగు ముందుకు వేయాలని కోరారు. ఫామ్‌హౌజ్ పేరుతో చెరువులు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారి పేర్లను కూడా బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఎన్ కన్వెన్షన్ కూల్చివేత విషయంలో 2014లోనే హైకోర్ట్ ఆదేశాలున్నప్పటికీ పదేండ్లుగా ఆదాయాన్ని నాగార్జున అనుభవిస్తున్నారని చెప్పారు. బఫర్‌జోన్‌లో అనుమతులు ఇచ్చిన అధికారులు, ఆ శాఖలకు మంత్రులుగా పనిచేసిన వారిపై కేసులు పెట్టాలని కోరారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని చెప్పారు. అమరవీరులను స్మరిస్తూ వచ్చేనెల 11 నుంచి 17 వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఇప్పటి వరకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ జరిగిందంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారని గుర్తు చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.40 వేల కోట్లు అవసరమని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై రాజకీయాలు చేయడం సరైంది కాదని కూనంనేని చెప్పారు. ఆడబిడ్డ అని చూడకుండా రాజకీయ కక్షసాధింపుతో వెంటపడి వేధింపులకు గురిచేయడం తగదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పోటీ చేస్తామనీ, లేదంటే తమకు బలమున్న చోట ఒంటరిగానే బరిలోకి దిగుతామని చెప్పారు.

జూరాల 45 గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రియదర్శని జూరాల ప్రాజెక్టుకు ఆల్మట్టి నారాయణపూర్ డ్యాముల నుంచి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతున్నది. ఇన్‌ఫ్లో 2,41,000 క్యూసెక్కులు రాగా జూరాల ప్రాజెక్టులో 45 గేట్లు ఎత్తి 2,24,861 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయంలోకి వదులుతున్నట్టు పిజెపి అధికారాలు తెలిపారు. జూరాల జల విద్యుత్ కేంద్రంలోని 5 యూనిట్ల నుంచి 25,585 క్యూసెక్కులను పవర్‌కు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టులు ప్రస్తుత నీటిమట్టం 316.770 అడుగులు ఉంది. 4.340 టిఎంసిల నీటిని నిల్వ ఉంచుకొని దిగువ ప్రాంతానికి వదిలారు. నెట్టెంపాడుకు 750, కోయిల సాగర్ 613, బీమా2 లిఫ్టు 750, లెఫ్టు కెనాల్‌కు 820, ఎడమ కెనాలకు 658 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్టు పేర్కొన్నారు.

పల్లా , మల్లారెడ్డి అక్రమ నిర్మాణాలపై నిగ్గు తేల్చాలి

- హైడ్రా కమిషనర్‌కు వజ్రేష్ యాదవ్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించి వాటిని కాపాడాలని కాంగ్రెస్ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. బుధవారం హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చామకుర మల్లారెడ్డి మేడ్చల్ మండలం నల్లకుంట చెరువు సర్వే నెంబరు 33లోని 13 ఎకరాల్లో మల్లారెడ్డి సీఎంఆర్ మెడికల్ కాలేజీ, సూతారి చెరువు సర్వే నెంబరు 46లోని 29 ఎకరాల విస్తీర్ణంలో సిఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, కోమటికుంట సర్వే నెంబర్ 647లోని 20 ఎకరాల్లో మల్లారెడ్డి యూనివర్సిటీ, నిలా చెరువు సర్వే నెంబరు 428లోని 5.30 ఎకరాల భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, సర్వే నెంబరు 29లో 14.03 ఎకరాల భూమిని కబ్జా చేసి కమర్షియల్ నిర్మాణాలు చేపట్టినట్టు తెలిపారు. మల్కాజి గిరి ఎమ్మెల్యే, మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖరరెడ్డి కూడా పలు చెరువులు, కుంటలు కబ్జా చేసి అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఘటకేసర్ మండలంలోని వెంకటపూర్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనురాగ్ విద్యా సంస్థలు, నీలిమ హాస్పిటల్ భవనాలు కూడా చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. పూడూరులో బీజేపీ నేతకు చెందిన అల్లుడు చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. ఈ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నియోజకవర్గం పరిధిలోని కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు స్పందించిన కమిషనర్.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

వరంగల్ సుస్థిరాభివృద్ధి సాధించాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- గవర్నర్‌ను సన్మానించిన మంత్రి 'పొంగులేటి'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చారిత్రక వారసత్వ నగరమైన వరంగల్ మరింత సుస్థిరాభివృద్ధి సాధించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. బుధవారం హన్మకొండ కలెక్టరేట్‌లో హన్మకొండ, వరంగల్ జిల్లాల అభివృద్ధిపై కలెక్టర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో జిల్లా ముందుండాలన్నారు. పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా సౌర విద్యుత్‌ను వినియోగించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధిస్తున్నదని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల తీరు తనను ఆకట్టుకుందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించడం తనను ఆకట్టుకున్నదని తెలిపారు. నగరంలోని ఆస్పత్రులు ఎంతో పరిశుభ్రంగా ఉన్నాయని తెలిసి చాలా సంతోషం కలిగిందన్నారు. సౌర విద్యుత్ విషయం ప్రస్తావన సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ.. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ రైతులకు ఉచిత విద్యుత్తును రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ఈ విషయమై రాష్ట్ర గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. అంతకుముందు హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద.. జిల్లాల్లో చారిత్రక దేవాలయాలు, ప్రదేశాలు, పార్కులు, స్మార్ట్ సిటీ, జాతీయ రహదారులు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, విపత్తుల నిర్వహణ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, ప్రతిపాదిత కూరగాయల మార్కెట్, పారిశుద్ధ్య నిర్వహణ, బయో మైనింగ్ ప్లాంట్, కాళోజీ కళాక్షేత్రం, ఎంజీఎం ఆస్పత్రి, ఐసీడీఎస్, ఎనుమాముల మార్కెట్ తదితర అంశాలతోపాటు విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ తదితర శాఖల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో మంత్రి అనసూయ సీతక్క, శాసనమండలి వైస్ ఛైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీలు బస్వరాజ్ సారయ్య, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కెఆర్ నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాఖడే, అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి, హన్మకొండ, వరంగల్ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అదజేస్తున్న మంత్రి పొంగులేటి

ఆర్‌టిసి డిపో ప్రాంగణంలో మొక్క నాటిన వినోద్‌కుమార్

ఆర్‌టిసి అభివృద్ధికి కృషి

- ఆర్‌టిసి ఇడి వినోద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి ఆర్‌టిసి అభివృద్ధికి కృషి చేయాలని కరీంనగర్, హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం ఆర్‌టిసి డిపోను ఆయన సందర్శిం చారు. తొలుత ఆర్‌టిసి డిపో ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన డిపో ప్రాంగణంలోని గ్యారేజీ, ఇతర కార్యాలయాలను పరిశీలించారు. కార్మికులు, ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పచ్చదనాన్ని పెంచాల్సి న అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. పర్యావరణ కాలుష్యం తగ్గించుకోవడం కోసం ప్రయత్నం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం ఏ.సరిరామ్, డిపో మేనేజర్ ఎం.దేవేందర్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్

- హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిగ్ అలర్ట్. రాష్ట్రంలో శుక్ర, శని, ఆదివారాల్లో భారీ నుంచి అతి భారీ, అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరికలు జారీ చేశారు. గురువారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముంది.

మరోవైపు మంగళవారం జార్ఖండ్ పరిసర ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం ఈశాన్య మధ్యప్రదేశ్ ప్రాంతంలో కేంద్రీకృతమై బలహీనంగా ఉంది. ఈ అల్పపీడనాలు, నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల వర్షాలు పడే అవకాశాలున్నాయి. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వానలు, ఆ తర్వాత మూడ్రోజులు ఎక్కువ ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు, కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతో వర్షం పడొచ్చు. రాబోయే 48 గంటల పాటు జీహెచ్ఎంసి పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నగరంలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తుంది.